

ఏడాదిన్నరగా సాగదీత!

యాదాద్రిలో చేపట్టిన నెట్‌వర్క్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఏడాదిన్నర గడిచినా కొనసాగుతూనే ఉన్నాయి. - 10లో



ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

పేదల ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 31°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోజంతా ముసురు

- జిల్లాలో 8.7 మి.మీ సగటు వర్షపాతం



నల్లగొండ : జిల్లాలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ముసురుతో కూడిన వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 8.7మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చిట్యాల మండలంలో 23.7 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా మునుగోడు 23.6, నకిరేకల్ 19.5, నార్కట్‌పల్లి 18.6, చండూర్ 15.7, నల్లగొండ 16.5, కట్టంగూర్ 15.7, శాలిగౌరారం 15.0, కేతేపల్లి 14.2, మర్రిగూడ 14.0, తిప్పర్తి 12.3, మాడ్గులపల్లి 11.0, నాంపల్లి 10.3, గుర్రంపోడు 9.0, చింతపల్లి 8.8, కనగల్ 8.7, వేములపల్లి 7.3, నిడమనూర్ 4.1, చందంపేట 3.6, గుండ్లపల్లి 3.4, మిర్యాలగూడ 3.2, దేవరకొండ 3.2, కొండమల్లేపల్లి 3.1, అనుముల 3.0, పీఏపలి 2.6, త్రిపురారం 2.3, నేరెడుగొమ్ము 2.0, పెద్దవూర 1.6, సాగర్ 0.6, దామచర్ల 0.5, అడవిదేవులపల్లిలో 0.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

చండూరు ఎంపీపీపై అవిశ్వాసానికి నోటీసు



నోటీస్ అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

చండూరు : చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణిపై అవిశ్వాస నోటీసును ఎట్టకేలకు ఆర్డీఓ తీసుకున్నారు. అవిశ్వాసం నోటీస్ అందజేసేందుకు ఈ నెల 6వ తేదీ నుంచి సభ్యులు నల్లగొండ ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కానీ, ఆయన వారికి సమయం ఇవ్వలేదు. దీంతో సభ్యులు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి ఆర్డీఓపై ఫిర్యాదు చేశారు. చివరకు ఆర్డీఓ సమయం ఇవ్వడంతో మంగళవారం 9 మంది ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీపై అవిశ్వాసం కోరుతూ నోటీసు అందజేశారు. నోటీసును అందజేసిన వారిలో ఎంపీటీసీ సభ్యులు అవ్వారు గీత, భాస్కర్, గౌరిగె సత్తయ్య, వెంకటమ్మ, పల్లె వెంకన్న, వనజ, లక్ష్మమ్మ, కావలి మంగమ్మ, చేపూరి యాదయ్య ఉన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై 21న అవగాహన సదస్సు

నల్లగొండ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ఆలోచనలను వెలికితీసి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలపై సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఈనెల 21న అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులోగల సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాలలో అన్ని పాఠశాలల యాజమాన్యాలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక సైన్స్ ఉపాధ్యాయుడు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 98485 76845 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో తహసీల్దార్లు

నల్లగొండ : అదనపు కలెక్టర్‌గా బదిలీపై వచ్చిన జె.శ్రీనివాస్ మంగళవారం విధులకు హాజరయ్యారు. ఆయనను తహసీల్దార్లు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, డీలర్ల సంఘం నాయకులు నాగరాజు, సత్యనారాయణ ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

20న 'బెస్ట్ అవైలబుల్' డ్రా

నల్లగొండ : ఈ విద్యా సంవత్సరం బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో దరఖాస్తు చేసుకున్న ఎస్సీ విద్యార్థుల ఎంపికకు ఈనెల 20వ తేదీన డ్రా తీయనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఈ నెల 20న ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించే డ్రాకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని పేర్కొన్నారు.

4.40 శాతానికి తగ్గిన పేదరికం

- 11, 12, 14 స్థానాల్లో సూర్యాపేట, యాదాద్రి, నల్లగొండ జిల్లాలు
- మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్‌లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో పేదరికం తగ్గింది. 2015–16 సంవత్సరంతో పోల్చితే 2019–21 సంవత్సరాల్లో నల్లగొండ జిల్లాలో పేదరికం భారీగా తగ్గినట్లు నీతి ఆయోగ్ విడుదల చేసిన మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (ఎంపీఐ)–2023లో వెల్లడించింది. నల్లగొండ జిల్లాలో అప్పట్లో పేదలు 13.35 శాతం ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 4.40 శాతానికి తగ్గింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రస్తుతం 4.24 శాతం, సూర్యాపేట జిల్లాలో 3.89 శాతం మంది పేదలు ఉన్నట్లు పేర్కొంది. వివిధ కేటగిరీల్లో ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేసి ఈ నివేదికను రూపొందించింది. ఆరోగ్య పరంగా పౌష్టికాహారం, శిశు, బాలల మరణాల రేటు, గర్భిణుల ఆరోగ్యం, విద్యా పరంగా పాఠశాల విద్యను అభ్యసించిన సంవత్సరాలు, పాఠశాలల్లో వారి హాజరు, స్టాండర్డ్ లివింగ్ విభాగంలో వంటచమురు, శానిటేషన్, తాగునీరు, ఇళ్లు, విద్యుత్, ఆస్తులు, బ్యాంకు అకౌంట్‌వంటి సదుపాయాల ప్రాతిపదికన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ఆధారంగా వీటిని తెల్పినట్లు ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కేటగిరీల ఆధారంగా చేసిన పేదరిక విశ్లేషణ ప్రకారం సూర్యాపేట జిల్లా 11వ స్థానంలో ఉండగా, యాదాద్రి భువనగిరి జిల్లా 12వ స్థానంలో, నల్లగొండ జిల్లా 14వ స్థానంలో ఉన్నట్లు వివరించింది.

● జన్మదిన వేడుకలు



జన్మదినం సందర్భంగా నల్లగొండలో మంత్రి జగదీశ్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ బడుగుల, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, కిషోర్, లింగయ్య తదితరులు



హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

జేపీఎస్‌లకు మార్కులు!

- నాలుగేళ్ల సర్వీస్ పూర్తయినవారి క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభం
- పనితీరు ఆధారంగా మార్కులు వేస్తున్న అధికారులు
- నెల రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయం
- మొదటిరోజు నల్లగొండ, కనగల్ మండలాల్లో నాలుగు గ్రామాల్లో పర్యటన



నల్లగొండ మండలం అన్నారంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

నల్లగొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్) క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలైంది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తియిన జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు జేపీఎస్ పనితీరును మూల్యాంకనం చేసేందుకు జిల్లాలో కమిటీని ఏర్పాటు చేసింది. మంగళవారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి నల్లగొండ మండలం జీకె అన్నారం, రసుల్‌పుర, కనగల్ మండలం పర్వతగిరి, మర్కినేనిగూడెం గ్రామంలో పర్యటించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో కలిసి గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. ఎవాల్యుయేషన్ యాప్‌లో ఆయా పనుల ఆధారంగా మార్కులు అప్లోడ్ చేశారు.

393 మంది జేపీఎస్‌లకు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి..

జిల్లాలో 844 గ్రామపంచాయతీలు ఉన్నాయి. అందులో 661 గ్రామాల్లో జేపీఎస్ పోస్టులు మంజూరయ్యాయి. అందులో 648 మంది జేపీఎస్‌లు విధుల్లో చేరగా 13 గ్రామాల్లో స్పోర్ట్స్ కోటాలో వచ్చిన వారిని తీసుకోవాల్సి ఉండగా ఎవరూ లేకపోవడంతో తీసుకోలేదు. 648 మందిలో 393 మంది పంచాయతీ కార్యదర్శులు 4 సంవత్సరాల సర్వీస్ పూర్తయింది.

గ్రామపంచాయతీలు	జేపీఎస్‌లు
844	648 మంది
నాలుగేళ్ల సర్వీస్ పూర్తియిన వారు 393 మంది	

పారిశుద్ధ్యం, రికార్డుల నిర్వహణకు ప్రాధాన్యం..

గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం మార్కులను కేటాయించింది. కార్యదర్శులు ఆయా గ్రామాల్లో చేయించిన పనుల ఆధారంగా ఏవిధంగా వర్కులు చేశారన్న దానిపై అంచనా వేసి దాన్ని మూల్యాంకనం చేస్తూ మార్కులు కేటాయించి అధికారులు జేపీఎస్ ఎవాల్యుయేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పారిశుద్ధ్యం, నర్సరీలు తదితర పనులకు సంబంధించిన వాటితోపాటు రికార్డుల నిర్వహణకు కూడా అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ మార్కులు కేటాయించారు. రికార్డులను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే కార్యదర్శులకు పెద్ద ఇబ్బందులు ఉండే అవకాశం లేవు. జిల్లాలో దాదాపు అన్ని గ్రామపంచాయతీల్లో కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనుల విషయంలో సమీక్షలు చేసినందున దాదాపు అన్నీ సవ్యంగానే జరిగాయి. దాంతో జేపీఎస్‌లకు మార్కులు కూడా అధికంగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రోజూ 10 నుంచి 15 పంచాయతీల్లో పర్యటన..

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న కార్యాచరణను నెల రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ఎన్నికలు సమీపిస్తున్నందున ఆ తర్వాత ఎన్నికల విధుల్లో అంతా బిజీ అవుతారన్న ఉద్దేశంతో ఈలోగానే పూర్తి చేయాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లాలో నాలుగేళ్లు పూర్తయిన జేపీఎస్‌లు 393 మంది ఉన్నందున ఆయా గ్రామాల్లో పర్యటించి సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతిరోజు 10 నుంచి 15 పంచాయతీలు పర్యటించి నెల రోజుల్లోనే ఈ ప్రక్రియను అంతా పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

పొగాకు నియంత్రణపై దృష్టిపెట్టాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ : పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ.. దాని నియంత్రణపై దృష్టి పెట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు విషయంలో స్వీయ నియంత్రణ పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైద్య, పోలీసుశాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేసి పొగాకు వాడకాన్ని నియంత్రించాలన్నారు. మున్సిపల్ అధికారులు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ కెఆర్‌కె.ప్రసాదరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండల్‌రావు, డీఈఓ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటరు జాబితా రూపొందించాలి

ఎన్నికలు నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో నిర్వహించాలంటే తప్పులు లేని, పారదర్శక ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీలో బూత్ లెవెల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓలు) పాత్ర చాలా కీలకమన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని ఓటర్ జాబితాలో నమోదు చేయాలని సూచించారు. జూలై 19 నుంచి 21 వరకు బీఎల్‌ఓలకు, బీఎల్‌ఓల సూపర్‌వైజర్లకు మండలస్థాయిలో శిక్షణ ఇస్తారని తెలిపారు. జూలై 21లోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్‌డీఓ రవి, చెన్నయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

రైతాంగ అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- మూసీ కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల



మూసీ కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : రైతాంగ అభ్యున్నతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మూసీ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వలకు మంగళవారం ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగు నీరందించి రైతును రాజుగా చూడడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రెండు పంటలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండగలా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ ప్రాజెక్టు గేట్ల మరమ్మతుకు రూ.19 కోట్లు, మూసీ కాల్వల ఆధునీకరణకు రూ.65 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి మూడు గంటల పాటు ఉచిత విద్యుత్ సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు తమ మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. కాల్వలకు వదిలిన నీటిని ఎగువన ఉన్న రైతాంగం పొదుపుగా వాడుకుని చివరి ఆయకట్టు భూములకు చేరే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, బొప్పని స్వర్ణలతాసురేష్, ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, నీటిపారుదలశాఖ సూర్యాపేట జిల్లా ఎస్ఈ శివధర్మతేజ్, ఈఈ భద్రునాయక్, మూసీ ప్రాజెక్టు డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు ఉదయ్, స్వప్న, మమత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నాయకులు గోలి వేణుమాధవరెడ్డి, కొండ సైదులు, డి.నాగేశ్వరావు, లింగయ్య పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి



తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం నల్లగొండ ఎమ్మెల్యే కాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ఉద్యోగులకు మల్టీజోన్ కేటాయింపు

నల్లగొండ : పౌరసరఫరాల శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు మల్టీజోన్‌లను కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. నల్లగొండలో ఏఎస్‌ఓగా పని చేస్తున్న నిత్యానందంకు మల్టీ జోన్–1 పరిధిలోని కామారెడ్డి జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏఎస్‌ఓగా పని చేస్తున్న సీహెచ్ బ్రాహ్మారావుకు మల్టీ జోన్ –1 పరిధిలోని మెదక్ జిల్లాలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు వారు విధుల్లో చేరాల్సి ఉంది.

క్రమశిక్షణ తప్పితే బహిష్కరణే..

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఎంతటి వారికైనా బహిష్కరణ తప్పదని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం దామరచర్ల మండలం వాడపల్లి గ్రామంలోని శ్రీమీనాక్షీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎవరిని ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించలేదని కొందరు తమకు టికెట్ కేటాయించారని తప్పుడు ప్రచారం చేసుకుంటూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. పార్టీ టికెట్ ఎవరికి కేటాయించినా గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో భాస్కర్‌రావును ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని అసెంబ్లీకి పంపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, పాదిల శ్రీనివాస్, రామలింగం, గాజుల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పెన్షన్ సాధనపై తాడో పేడో తెల్చుకుందాం

- టీఎస్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



మిర్యాలగూడలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

మిర్యాలగూడ టౌన్ : ఒక్కరైతే ఒంటరే.. కానీ ఒక్కటైతే ఒక ఉప్పెనలా ఉంటుందని, పాత పెన్షన్ సాధనపై సెప్టెంబరులోగా తాడో.. పేడో తెల్చుకునేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర మంగళవారం మిర్యాలగూడ పట్టణానికి చేరుకుంది. ముందుగా సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రథయాత్రకు స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2004 తరువాత నియమకం అయినా ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 12వ తేదీన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలతో భారీ సభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శిరందాసు రామదాసు, కోశాధికారి అందుగుల విజయ్, మహిళా కన్వీనర్ వల్లపుదాసు భూలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఠాకూర్ సురేందర్‌సింగ్, రాంబాబు, పంకజ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కర్రోల్ల దేవయ్య, నరేందర్‌రావు, రోషన్, చంద్రకాంత్, రాజేష్, పరమేశ్, రిషిక, ఉప్పల పద్మ, ప్రభాకర్, బక్కా శ్రీనివాసచారి, నాగమణి, ఫల్‌రెడ్డి యోగేందర్‌రెడ్డి, నర్సింహనాయక్ తదితరులున్నారు.

పల్లెల్లో పౌర పఠన మందిరాలు

- కొత్త మండలాలు, పెద్ద పంచాయతీల్లో ఏర్పాటుకు సన్నాహాలు
- 15 చోట్ల నెలకొల్పేందుకు ప్రతిపాదనలు
- మూడు చోట్ల ఇప్పటికే ప్రారంభం



అడవిదేవులపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన పౌర పఠన మందిరం

రామగిరి(నల్లగొండ) : గ్రంథాలయాలు విజ్ఞాన సంపదకు నిలయాలు. అందరికీ అవసరమైన పుస్తకాలు, వార్తా పత్రికలు గ్రంథాలయంలో అందుబాటులో ఉంటాయి. పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు లభ్యమవుతాయి. ఎవ్వరైనా వెళ్లి వాటిని చదివి విజ్ఞాన సంపదను పొందవచ్చు. అంతటి ప్రాధాన్యమున్న గ్రంథాలయాలు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 31 వరకు ఉన్నాయి. వీటికి తోడుగా ప్రతి మండల కేంద్రం.. పెద్ద గ్రామపంచాయతీల్లో పౌర పఠన మందిరాల పేరుతో మినీ గ్రంథాలయాల ఏర్పాటుకు జిల్లా గ్రంథాలయ సంస్థ అడుగులు వేస్తోంది.

భవనాన్ని సమకూర్చితేనే..

నల్లగొండ జిల్లాలో 15 పౌర పఠన మందిరాలకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు అడవిదేవులపల్లి, చెర్వుగట్టు, గుండ్రాంపల్లిలో నూతనంగా పఠన మందిరాలను ప్రారంభించారు. మిగతా 12 చోట్ల ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. స్థానికంగా గ్రంథాలయానికి భవనాన్ని సమకూర్చితే జిల్లా గ్రంథాలయ శాఖ నుంచి అవసరమైన పుస్తకాలు, ఫర్నిచర్‌తో పాటు ప్రతి నెలకు కావాల్సిన నిర్వహణ ఖర్చులు అందిస్తారు.

సర్పంచ్‌లు ఆసక్తి చూపుతున్నారు



"గ్రంథాలయాల ఏర్పాటుకు సర్పంచ్‌లు ఆసక్తి చూపుతున్నారు. నిధులను బట్టి భవిష్యత్‌లో మరిన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాల్లో 30 వేల వరకు సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాల్లో సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. జెడ్పీ నిధుల నుంచి ఒక్కో గ్రంథాలయానికి రూ.1.5 లక్షల చొప్పున కేటాయించి టాయిలెట్ల నిర్మాణం చేపడుతున్నాం. నాంపల్లి, కనగల్, తిప్పర్తి, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లిలో పనులు ప్రారంభమయ్యాయి.

– రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

క్లుప్తంగా

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో దహనం చేశారు. రాహుల్‌గాంధీకి మంత్రి కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, నాయకులు పరైపాటి యుగేందర్, మలిపెద్ది మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ ఆర్డీఓపై పోలీసులకు ఫిర్యాదు

కోదాడ: మండలంలోని తమ్మర గ్రామానికి చెందిన కనగాల జనార్దన్‌రావు సోమవారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కోదాడ ఆర్డీఓ కిశోర్‌కుమార్‌పై ఫిర్యాదు చేశాడు. సమాచార హక్కు చట్టం కింద ఇచ్చిన దరఖాస్తు గురించి తెలుసుకునేందుకు గత నెల 28న కోదాడ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన తనను ఆర్డీఓ అసభ్య పదజాలంతో దూషించాడని బాధితుడు పేర్కొన్నాడు. అంతేకాకుండా తనను బయటకు నెట్టివేయమని కార్యాలయ సిబ్బందిని ఆదేశించి అవమానపరిచాడని, 82 సంవత్సరాల తనకు కనీస మర్యాద కూడా ఇవ్వని ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ.. డ్రైవర్ మృతి

వేములపల్లి: ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన ఘటన వేములపల్లి మండల కేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రంలోని ఎన్‌ఎస్పీ క్యాంపునకు చెందిన చిట్టిమళ్ల వెంకన్న(30) అద్దంకి- నార్కట్‌పల్లి రహదారి మీదుగా ట్రాక్టర్‌పై వెళ్తుండగా.. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ టైరు పగలడంతో ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడడంతో వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం వెంకన్నను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

బెదిరిస్తున్న వారిపై ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం: అసైన్డ్ భూమిలోకి వెళ్లకుండా కులం పేరుతో దూషిస్తూ బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓ రైతు మంగళవారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. కేతేపల్లి మండలంలోని ఇనుపాములకు చెందిన మేకల భిక్షమయ్యకు గ్రామంలోని సర్వే నంబర్ 59లో 2ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. అతడు బత్తుల నర్సింహారెడ్డికి ఆ భూమిని కౌలుకు ఇచ్చాడు. కాగా నర్సింహారెడ్డి తనకు భూమి అమ్మినట్లుగా నకిలీ పత్రాలను సృష్టించి తన భూమిలోకి వెళ్తే చంపుతానంటూ బెదిరిస్తున్నట్లు బాధిత రైతు ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఆటో బోల్తా.. ఇద్దరు దుర్మరణం

- దైవ దర్శనానికి వెళ్లొస్తూ ఒకరు
- కిరాణా సామగ్రి కోసం వెళ్లి మరొకరు..

పెద్దఅడిశర్లపల్లి: అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఇద్దరు మృతిచెందిన ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అజ్మాపురం గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మాపురం గ్రామానికి చెందిన మంగిళిపల్లి మంగమ్మ భర్త చాలా ఏళ్ల క్రితమే మృతిచెందాడు. ఆమె ఒక కుమారుడు ఉన్నాడు. ఆమె భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం అమావాస్య కావడంతో ఆమె నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి రాత్రి అక్కడే నిద్ర చేసి మంగళవారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. ఈ క్రమంలో కొండమల్లేపల్లికి చేరుకున్న ఆమె అక్కడి నుంచి ఆటోలో అజ్మాపురం గ్రామానికి వెళ్తోంది. కాగా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కొట్టాలగడ్డకు చెందిన జటావత్ గాస్య పక్కనే వద్దిపట్ల గ్రామంలో కిరాణం షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కిరాణా సామగ్రి కోసం మంగళవారం కొండమల్లేపల్లికి వచ్చిన గాస్య అదే ఆటోలో వద్దిపట్లకు బయల్దేరాడు. ఈ క్రమంలో ఆటో అజ్మాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంగమ్మ, గాస్యలపై ఆటో పడటంతో వారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఆటో డ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.



పెద్దఅడిశర్లపల్లి: బోల్తాపడిన ఆటో



మంగమ్మ (ఫైల్)



గాస్య (ఫైల్)

చెర్వుగట్టుకు వెళ్లొస్తూ..

చిట్యాల: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం అనంతారం గ్రామానికి చెందిన మారగోని బాలరాజు, అతడి భార్య శశికళ (40), మరదలు రాజ్యలక్ష్మితో కలిసి ఆటోలో సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టుకు వెళ్లారు. రాత్రి అక్కడే నిద్ర చేసి మంగళవారం తెల్లవారుజామున తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తుండగా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న శశికళ, రాజ్యలక్ష్మి రోడ్డుపై పడిపోగా వారి మీదుగా కారు వెళ్లింది. బాలరాజుకు ఎటువంటి గాయాలు కాలేదు. తీవ్రంగా గాయపడిన శశికళ, రాజ్యలక్ష్మిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో శశికళ మృతిచెందింది. మెరుగైన వైద్యం కోసం రాజ్యలక్ష్మిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



శశికళ మృతదేహం

విద్యుదాఘాతంతో రైతు మృతి

మద్దిరాల (తుంగతుర్తి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మద్దిరాల మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండల కేంద్రానికి చెందిన నెల్లుట్ల సోమయ్య(57) గ్రామ శివారులోని కొత్త చెరువు కట్ట కింద గల తన వ్యవసాయ పొలానికి బోరు మోటారు ద్వారా నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. కాగా బోరు మోటారు స్టార్టర్ డబ్బాను బైండింగ్ వైరుతో స్తంభానికి కట్టగా ఆ వైరు సర్వీస్ వైరుకు తగిలి ఉండడంతో సోమయ్య మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి మల్లయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నా రు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.



సోమయ్య (ఫైల్)

మిర్యాలగూడలో ప్రైవేట్ హెల్పర్..

మిర్యాలగూడ టౌన్: విద్యుదాఘాతంతో ప్రైవేట్ హెల్పర్ మృతిచెందిన ఘటన మిర్యాలగూడ మండలంలోని ఆలగడప గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలగడప గ్రామానికి చెందిన మంద మట్టయ్య(36) ట్రాన్స్‌కోలో ప్రైవేట్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం గ్రామ సమీపంలోని సెల్‌టవర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో అతడు టవర్‌ను పరిశీలిస్తున్నాడు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.



మట్టయ్య మృతదేహం

ట్రేడ్ లైసెన్సుల విషయంలో వాగ్వాదం

చౌటుప్పల్: దుకాణాల ట్రేడ్ లైసెన్సుల విషయంలో పలువురు వ్యాపారులు మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌ను చుట్టుముట్టి ఆయనతో వాగ్వాదానికి దిగారు. లైసెన్సులు తీసుకోకుంటే దుకాణాలకు తాళాలు ఎలా వేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా వేలాది రూపాయల చొప్పున లైసెన్సు ఫీజు చెల్లించాలంటే తమతో కాదంటూ వ్యాపారులు వాపోయారు. తమ వ్యాపారానికి ఇబ్బంది కలిగేంచేలా దుకాణాలకు తాళాలు వేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వ్యాపారుల తీరుకు మున్సిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్ రెడ్డి తీవ్రంగానే స్పందించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది సొంతంగా నిర్ణయాలు తీసుకోరని ఆయన వ్యాపారులకు తెలిపారు. ప్రభుత్వ పాలసీలో భాగంగా వచ్చిన జీఓ మేరకే ట్రేడ్ లైసెన్సుల ఫీజుల నిర్ణయించడం జరిగిందన్నారు. లైసెన్సు తీసుకోకుంటే వ్యాపారులకే ఇబ్బంది ఉంటుందన్నారు. జీఓ ప్రకారంగా తాము జరిమానా విధించాల్సి వస్తుందని తెలిపారు. వ్యాపారులకు ఏమైనా ఇబ్బందులుంటే లిఖితపూర్వకంగా తమకు తెలియజేస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

బైక్‌లు చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్

భువనగిరి: మద్యానికి బానిసై ఈజీ మనీ కోసం బైక్‌లు చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను భువనగిరి పోలీసులు అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లికి చెందిన ఏర్పుల సాయిసాగర్ హైదరాబాద్‌లోని రాంపల్లిలో నివాసముంటున్నాడు. సాయిసాగర్‌తో పాటు రాంపల్లికే చెందిన బెల్లపు సాయి రాహుల్ 10వ తరగతి వరకు ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ప్రస్తుతం వారు ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. వీరు మద్యానికి బానిసై తమకు వచ్చే ఆదాయం సరిపోక చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఉప్పల్‌లో బైక్ దొంగతనం చేసి దానిపై యాదగిరిగుట్టకు వెళ్తున్నారు. మార్గమధ్యలో అదే రోజు భువనగిరి పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన గంధ్రకోట తిరుపతి తన బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేయగా.. దానిని సాయిసాగర్, సాయి రాహుల్ చోరీ చేసి ఘట్కేసర్ సమీపంలో రోడ్డు పక్కన చెట్ల పొదల్లో దాచిపెట్టారు. తిరుపతి తన బైక్ పోయిందని భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మద్యానికి డబ్బులు లేకపోవడంతో ఘట్కేసర్ సమీపంలో దాచిన బైక్‌ను విక్రయించాలని సాయిసాగర్, సాయి రాహుల్ నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయిసాగర్ తన స్వగ్రామమైన వీరారెడ్డిపల్లికి వెళ్తుండగా భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి సాయిసాగర్ పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంటనే పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతడిచ్చిన సమాచారం మేరకు సాయి రాహుల్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుధీర్ కృష్ణ తెలిపారు. నిందితులు ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.



అరెస్టయిన దొంగలను చూపుతున్న పోలీసులు

ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలి



ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు

చందూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండల పరిధిలో ఏర్పాటు చేసే క్రాంతి ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలపాలని చందూరు మండలంలోని వెల్మకన్నె గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం వెల్మకన్నె గ్రామంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గట్టుప్పల-పుట్టపాక మధ్యలో నిర్మించ తలపెట్టిన క్రాంతి ఫార్మా కంపెనీతో 12 గ్రామాల ప్రజలు కాలుష్యం బారిన పడే అవకాశం ఉందని, వెంటనే అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కర్నాటి మల్లేషం మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీ కాలుష్యంపై 12 గ్రామాల్లో ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రజలను సమీకరించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ నాయకుడు, ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్లా శివశంకర్ మాట్లాడుతూ.. క్రాంతి ల్యాబరేటరీ పర్మిషన్‌ను రద్దు చేసిన ప్రభుత్వం కలెక్టర్ మీద కోర్టుకెళ్లి స్టే తెచ్చి పనులు ప్రారంభిస్తున్నటువంటి విషయాన్ని గమనించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ భీమగాని మహేష్‌గౌడ్, గట్టుప్పల్ సర్పంచ్ ఇడెం రోజ, అఖిలపక్ష నాయకులు చాపల మారయ్య, గోపాల్‌రెడ్డి, ఏసిరెడ్డి యాదవరెడ్డి, భీమనపల్లి రమేష్, రావుల రమేష్‌యాదవ్, దుర్గయ్య, సర్పంచ్ సామల భాస్కర్, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు


ఆత్మకూరు(ఎం): ఆలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు రూ. 1.79కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఏడు సబ్ సెంటర్ భవన నిర్మాణాలకు రూ. 20లక్షల చొప్పున, నియోజకవర్గ పరిధిలోని కాటేపల్లి నుంచి మోత్కూరుకు రూ. 8కోట్లు, కప్రాయపల్లి నుంచి మోదుభావిగూడెం వయా ఉప్పలపహడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 5.50 కోట్లు, మాటూరు నుంచి ఓరుటూరు వరకు రోడ్డు మరమ్మతు పనులకు రూ.కోటి, ఆలేరు నుంచి రఘునాథపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 15కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్, ఉప్పలయ్యయాదవ్, యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, పి. పూర్ణచందర్‌రాజు, వెంకటేష్, సోలిపురం అరుణ, నాతి రాజు, బెజ్జంకి భిక్షం, కోరె వెంకన్న, కోరె బీరప్ప, మల్లెల పర్వతాలు, యాస రంగారెడ్డి, బూడిద చంద్రశేఖర్, దుంప పరుశరాములు ఉన్నారు.



మాట్లాడుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

పంట రుణాలు మాఫీ చేయాలని ధర్నా

రామన్నపేట: రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంట రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్న అధికార పార్టీ నాయకులు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్‌ను ఎందుకు స్వీకరించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మేడి రవిచంద్ర, మిర్యాల మల్లేశం, గంపల రామచంద్రారెడ్డి, గాదె శోభారాణి, నాగు ఆంజనేయులు, సింగనబోయిన జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



రామన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లహరిరెడ్డికి ఉత్తమ్, జానా నివాళి



లహరిరెడ్డి చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు

నిడమనూరు: ఇటీవల అకాల మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ యడవెల్లి రంగశాయిరెడ్డి కోడలు లహరిరెడ్డి చిత్రపటానికి నిడమనూరు మండలంలోని తుమ్మడం గ్రామంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మంగళవారం నివాళులర్పించారు. అనంతరం రంగశాయిరెడ్డి, ఆయన కుమారుడు వల్లభరెడ్డిలను పరామర్శించారు. కార్యక్రమంలో కుందూరు జయవీర్‌రెడ్డి, మేరెడ్డి వెంకట్రామిరెడ్డి, అంకతి సత్యం, రమేష్, మేరెడ్డి వివేక్, అబ్బత్ తదితరులున్నారు.

ఆస్తి తగాదాలతో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మాడుగులపల్లి: ఆస్తి తగాదాల నేపథ్యంలో మనోవేదనతో రైలు కిందపడి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన దేవిరెడ్డి ఎల్లారెడ్డి(55)కి ఆయన సోదరులకు మధ్య కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు నడుస్తున్నాయి. ఇటీవల వివాదాలు మరింత ముదరడంతో తీవ్ర మనోవేదనకు గురైన ఎల్లారెడ్డి సోమవారం రాత్రి తిప్పర్తి రైల్వే స్టేషన్ పరిధిలోని చెరువుపల్లి గ్రామ శివారులో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సోషల్ మీడియాలో విషయం ప్రచారం కావడంతో సమాచారం తెలుసుకున్న ఎల్లారెడ్డి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం ఎల్లారెడ్డిదిగా నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి కుమారుడు కళింగరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.



ఎల్లారెడ్డి (ఫైల్)

మనోవేదనతో పెట్రోల్ పోసుకొని బలవన్మరణం

తుర్కపల్లి: మనోవేదనతో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెదిన బరిగె బాలయ్య(52), ఆండాలు భార్యాభర్తలు. వీరిద్దరు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు మధు పుట్టుకతోనే నరాల బలహీనతతో బాధపడుతూ ఆరు సంవత్సరాల క్రితం మృతిచెందాడు. పెద్ద కుమారుడు రాజు సైతం నరాల బలహీనతతోనే రెండు నెలల క్రితం చనిపోయాడు. ఇద్దరు కుమారులు చనిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన బాలయ్య ఆదివారం రాత్రి తన బైక్‌లోని పెట్రోల్‌ను తీసుకొని ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు గమనించి మంటలు ఆర్పి 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఆండాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

నవజాత శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యుల ధర్నా
- నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రిలో ఘటన

నాగార్జునసాగర్: పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరిన గర్భిణికి సహజ ప్రసవం అవుతుందేమోనని వైద్యులు నిరీక్షించారు. కానీ ఆ నిరీక్షణే నవజాత శిశువు మృతికి కారణమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్‌కాలనీకి చెందిన వింధ్య పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఆమెను హిల్‌కాలనీలోని కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ చేస్తున్న క్రమంలో కడుపులోని శిశువు పల్స్ రేట్ పడిపోవడంతో అయోమయానికి గురైన డాక్టర్లు వెంటనే మరో హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. దీంతో వింధ్య కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అంబులెన్స్‌లో నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం అక్కడ డెలివరీ చేయగా రెండు గంటల తర్వాత శిశువు మృతిచెందింది. వింధ్య పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. కాగా నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ముందు మంగళవారం శిశువు మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. శిశువు మృతికి కారణమైన డాక్టర్లను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బీసన్న అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.



మరణించిన శిశువుతో కమలానెహ్రూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

కుటుంబ సభ్యుల కోరిక మేరకే ఆగాం: సూపరింటెండెంట్ భానుప్రసాద్‌నాయక్

వింధ్య అనే గర్భిణిని ప్రసవం కోసం ఆమె కుటుంబ సభ్యులు కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రికి హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఆమెను పరీక్షించిన తర్వాత ఆపరేషన్ చేయాలని చెప్పాం. కానీ బంధువులు మాత్రం నార్మల్ డెలివరీ కావాలని కోరారు. పుట్టబోయే బిడ్డకు కష్టమవుతుందని చెప్పినా వారు పర్వాలేదనడంతో నార్మల్ డెలివరీ చేస్తుండగా శిశువును బయటకు తీయడంలో కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో హాస్పిటల్‌లో సరైన పరికరాలు లేకపోవడంతో మరో హాస్పిటల్‌కు రెఫర్ చేశాం. అంతే తప్ప ఇందులో మా నిర్లక్ష్యమేమీ లేదు.

ఉదయ్‌కిరణ్ వైద్యానికి పలువురి ఆర్థికసాయం

సాక్షి ఎఫెక్ట్..

మునగాల(కోదాడ): మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మంగళవారం అతడిపై సాక్షి దినపత్రికలో 'పేద కుటుంబానికి అనుకోని కష్టం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పలువురు దాతలు స్పందించి ఆర్థికసాయం చేశారు. లివర్ ఇన్‌ఫెక్షన్, కామెర్లతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన ఉదయ్‌కిరణ్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అతడి తల్లి రమణ దాతల సాయం కోరింది. ఈ మేరకు సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన పలువురు దాతలు తమకు తోచినంత ఉదయ్‌కిరణ్ సోదరుడు వేణుగోపాల్‌కు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం అందించారు. మంగళవారం సుమారు రూ.50వేల పైచిలుకు ఆర్థికసాయం అందినట్లు వేణుగోపాల్ తెలి పాడు. ప్రస్తుతం తన సోదరుడు ఉదయ్‌కిరణ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, మంగళవారం ఆస్పత్రిలో వైద్యులు వెంటిలేటర్ ద్వారా వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నాడు. తమ కుటుంబం పడుతున్న కష్టాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షి దినపత్రిక యజమాన్యానికి వేణుగోపాల్, తల్లి రమణ కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబానికి ఆర్థికసాయం చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతిఒక్కరికి పేరుపేరున వారు ధన్యవాదాలు తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం ఉధృతం చేస్తాం

- ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

నేరేడుచర్ల: పేదల ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం ఉధృతం చేస్తామని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలోని సర్వే నంబరు 243, 244 లోగల ప్రభుత్వ భూముల కోసం ఎనిమిదేళ్లుగా పోరాటాలు చేస్తుంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు 11 మంది పేదలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే పేదల బతుకులు మారుతాయని ఆశిస్తే కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత వారికి బతుకులు లేకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. ఇప్పుడు స్థలం ఉన్నవారికి రూ.3లక్షలు ఇస్తామంటూ మరోసారి పేదలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. పేదలు అద్దె ఇళ్లలో కిరాయిలు కట్టలేక డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రాక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తుంటే వాటిని తొలగించి పేదలను రోడ్డు పాలు చేశారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిల్వ నిడలేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీడబ్ల్యూఓ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, వాస పల్లయ్య, కరుణాకర్, హుస్సేన్, పావని, సత్తెమ్మ, మౌలాంబి, దుర్గమ్మ, లక్ష్మయ్య, శ్రీను పాల్గొన్నారు.



నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న గుమ్మడి నర్సయ్య తదితరులు

ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న 95వ భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవస్థాపక వేడుకలు మంగళవారం మూడో రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ మాట్లాడుతూ.. భారతదేశం పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. మిరప, పసుపు, అల్లం, మిరియాలు పెద్ద ఎత్తున మన దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. ఐసీఏఆర్ ద్వారా ఉద్యానవన పంటలలో అధిక దిగుబడినిచ్చే రకాలు అభివృద్ధి చేయబడ్డాయని అన్నారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త నరేష్ మాట్లాడుతూ.. వానాకాలంలో కూరగాయలు, మిరప సాగు, వాటిలో తెగుళ్ల గురించి వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి మాట్లాడుతూ.. చిరు ధాన్యాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, అరోబిందో స్కూల్ ఉపాధ్యాయురాళ్లు మధులత, కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త లవకుమార్